# ఒర్రి

ఆర్మూర్-రెంజర్ల బస్ ధర్మోరా, గాంధీ బొమ్మ దగ్గర ఆగింది. చంకన బ్యాగు, చేతిలో నీళ్లబాటిల్‌తో బస్సు దిగాడు ధర్మపురి.

"పట్నం నుంచి ఇప్పుడేనా వచ్చుడు?"

"ఔ తాతా!"

"సదుకునుడయినట్టేనా" లింగయ్య తాత ప్రశ్న.

"ఇంక యాడ తాతా, గీ రోజుల్ల డిగ్రీ కాంగనే ఓల్లు పని ఇత్తరు? ఇంక రొండేండ్లన్న సదాల"

"బి.యిడి. చేస్తావా?" ప్రక్కనే ఉన్న ప్రభాకర్ సార్ అడిగాడు.

"ఎంట్రన్స్ అయితే బి.యిడి., ఎం.కాం. రొండింటికి ఇయ్యాలని ఉంది. దేంట్ల సీటు దొరుకుతే దాంట్ల సేరుత.

"మంచిది. మీ అమ్మ నిన్నటినుంచి ఎదిరిచూస్తున్నది. ఇంటికి నడు. తాతీల్లే (సెలవులే) గదా, రేపు మాట్లాడుకుందం" చుట్ట పీలుస్తూ అన్నాడు లింగయ్య తాత. తమ ఇంటివైపు అడుగులు వేశాడు ధర్మపురి. కళ్ళల్లో వత్తులు వేసుకుని కొడుకు కొరకు ఎదురుచూస్తున్న బాలవ్వకు, ధర్మపురిని చూడగానే ప్రాణం లేచి వచ్చింది. కొడుకును కౌగలించుకుని తనివితీరా తడిమింది. కళ్ళనుంచి నీళ్లు కారుతుండగా "ఎంత బక్కవడ్డవు నానా! తిండి సరిగా తిన్లేనట్టున్నవ్.

"మంచిగనే తిన్న. పరీక్షలప్పుడు సరిగ నిద్రలేక టయిముకు భోజనం చేయక కొంత బక్కవడ్డనేమో మనింటికచ్చిన గదా. నీ సేతి బువ్వ తింటే వారం రోజులు పాయంటే ఎప్పటోల కానా?" ధర్మపురి కూడా సజల నయనాలతో బదులిచ్చాడు.

"మంచిది. కాల్లు, సేతులు కడుక్కో, భోంచేద్దువుగని. నీ కిష్టమని మసాల పప్పు చారు చేసిన" కొడుక్కు ఎంత తొందరగా తన చేతి భోజనం పెట్టాలా, అని బాలవ్వ ఆతృత.

"మంచిగున్నావా అన్నా!" కాళ్ళు కడగడానికి నీళ్లిస్తూ అడిగింది అమృత, ధర్మపురి చెల్లెలు.

"ఆ, నువ్వెట్లున్నవ్? ఆకులు కత్తిరిచ్చుడైందే?"

"ఇంక యాడ. ఇంకొక గంట గావాల. ఇయ్యాల బీడీలు ఇచ్చెతందుకుపోతే బాగ చాటన్ (ఏరివేత) చేసింద్రు. మున్నూరు బీడీలు ఆల్ల పొట్టన బెట్టుకున్నారు. గందుకని ఆలిసెం అయింది."

"గీ కమిషన్‌దార్లు బాగ దోసుదుకు ఎగవడ్డరు. ఏమన్నా అంటే తంబాకు తక్క ఇత్తరు. బీడీలు బాగ చాటన్‌చేసి సతాయిత్తరు" బాలవ్వ అందుకుంది.

"నాకు మూన్నెల్లు తాతీల్లున్నై. ఆల్లతోని మాట్లాడుత. కంచం ముందు కూర్చుంటూ అన్నాడు ధర్మపురి. బాలవ్వ కొడుకు ముందు కూర్చుని కొసరి కొసరి వడ్డించింది. ఊర్లోని కబుర్లు తల్లి చెప్పగా వింటూ, తను హైద్రాబాదు విశేషాలు వివరిస్తూ భోజనం పూర్తిచేశాడు ధర్మపురి.

"పొద్దుగల్ల లేసినవేమో. గొంత పండుకో. నేను గూడ ఆకు కత్తిరియ్యాల" అంటు పడక ఏర్పాటు చేసింది బాలవ్వ.

* * *

సాయంత్రం అయిదు గంటల ప్రాంతంలో స్నేహితులను కలుసుకోవడానికి గాంధీబొమ్మ దగ్గరకు వచ్చాడు ధర్మపురి. అక్కడి హన్మాండ్ల గుడే ధర్మోరాకు రచ్చబండ. కాస్త వయసు మల్లినవాళ్ళు అక్కడ గ్రామ ముచ్చట్లు మాట్లాడుకుంటే దగ్గర్లోని డాబా హోటల్ కుర్రకారుకు పిచ్చాపాటీ కేంద్రం. ప్రక్కన కట్టిన బస్టాండు పేకాట నిలయ మవడంతో బస్సు కొరకు వేచి ఉన్నవారు అక్కడి ఇళ్ళచూర్ల నాశ్రయిస్తారు. హన్మాండ్ల గుడిదగ్గిరి పెద్దలను పలకరించి, వారడిగిన ప్రశ్నలకు జవాబులిచ్చి, డాబా హోటల్‌లోని తన వయసువారిలో చేరిపోయాడు ధర్మపురి. హైద్రాబాద్ విశేషాలను తన స్నేహితులకు వివరించి గ్రామ రాజకీయాల్లోని ప్రస్తుత 'స్టార్ల" గురించి తెలుసుకున్నాడు. వాళ్ల మధ్య గ్రామాభివృద్ధి పనుల గురించి కూడా చర్చ జరిగింది. చుట్టుప్రక్కల ఊర్లన్నిటికి తారురోడ్డు వచ్చినా దొన్కల్-ధర్మోరా మధ్య అయిదు కిలోమీటర్ల తారురోడ్డుకు ఏర్పడిన అవరోధాలను చర్చించారు. రోడ్డు సరిగా లేక వర్షాకాలంలో రెన్నెల్లు ఆర్.టి.సి.బస్సులు నడవని సంగతి కూడా తెలుసుకున్నాడు. ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లోని ఉపాధ్యాయులు ఊర్లో ఉండకుండా పొరుగూర్ల నుండి రోజూ రావడం, దానివల్ల విద్యార్థులపట్ల అశ్రద్ధ, ఇవన్నీ మాట్లాడుకున్నారు. యువకులు సాధారణంగా ఆకర్షణకు లోనయ్యే అమ్మాయిలు, సినిమాలు కూడా వారి మాటల్లో చోటుచేసుకున్నాయి. రాత్రి బాగా కావడంతో ఎవరిళ్ళకు వారు బయలుదేరారు. మర్నాడు అమృత చేసిన ఇడ్లీ టిఫిన్ చేసి, తల్లి బాలవ్వ దగ్గర కూర్చున్నాడు ధర్మపురి.

"అవ్వా, రాజీనామా పెట్టినంక గూడా బీడీలు సేత్తున్నవు, కొత్తకారటు దీసినవా?"

"లేదు నానా! గిప్పుడు నా అసుంటోల్లకు కొత్త కారటు ఓల్లిత్తరు? ఒర్దికి సేత్తున్నా. నీ కాలేజి ఫీజులకు కావాలని రాజీనామా పెట్టి. గా పైసల్తోనే నీ సదువు ముందుకు పోవట్టె. మీ నాయినకేం, మీదికొాయి సల్లగున్నడు. నాకచ్చింది తిప్పలు. ఏదో రెక్కలాడిందాక తండ్లాడాలగదా?

"నువ్వేం ఫికరు జెయ్యకు. నేను గూడ ఏదన్న పని జేసుకుంట సదుకుంట. రెండు మూడేండ్లు ఇంక సదితినంటే టీచరు పనో, ఆఫీసుల పనో దొర్కుతది. గప్పుడు నిన్ను బీడీలు సెయ్యనియ్య."

"మా అయ్య, మా అయ్య. నీ సంగతి నాకు తెలదే నానా! ఎంకిటేసుని దయతోని నీకు మంచి నౌకిరి దొరికితె నాకింకేం గావాల? కాలుమీద కాలేసుకుని బతుకుత."

"నువు గట్లనే అంటౌ. మల్ల సేసే బీడీలు సేత్తౌ. గిప్పుడు గా బీడీలు సేత్తె

ఎంతత్తున్నది? తుట్టికి పావుశేరుకు ఒర్దికి సేత్తున్నా. మెహనతంతే గని ఫండు (ప్రావిడెంట్ ఫండ్) కారటున్నోల్లకంటె సగం కూలికి సేయవడ్తివి" అమృత అందుకుంది.

"కూలి తక్కైతె తక్కాయే. మా అసుంటోల్లు ఏం జేత్తె గా పైసలన్న దొర్కుతై?" బాలవ్వ అంది."

"మీ అసుంటోల్లు గిట్ల ఒర్దికి బీడీలు జెయ్యవట్టి మా అసుంటి ఫండు కారటున్నోల్లకు తంబాకు తక్క ఇస్తున్నరు. పంద్ర సౌ బీడీలు జేసేదాన్ని వేయికే తంబాకు ఇయ్యవట్టిరి. మల్ల ఇంక నెలకు నాలుగయిదు బందులియ్యవట్టిరి" అమృత ఆవేదనగా అంది.

"గిప్పుడు ముందటి లెక్క బీడీలు యాడ తాగుతున్నారు? ఎసుంటోడు సిగిరేటు తాగవట్టె. ఇగ బీడీలు యాడ అమ్ముడైతయి? గందుకనే మనకు రజలిత్తున్నరు. ఒర్దికి బీడీలు సేపిచ్చుకుంటానికి కాదు.

"ఒర్దికి నీకు తంబాకు ఇత్తున్నారని నువు ఆల్లక్కడ మాట్లాడుతున్నవు. మన కష్టంతో ఆల్లకెంత ఫాయిద ఉన్నదో నీకేమెరుక?" "మనకేమొస్తున్నదో మనం జూసుకోవాలె గని ఆల్లకు ఫాయిద ఎక్క ఉన్నదని మనం పని సెయ్యకుంటె ఇల్లు ఎట్ల గడాల? నా అసుంటి ముసల్దానికి ఒర్దికైన తంబాకిచ్చెటోల్లేరి? ఏదో ఏండ్ల నుంచి భూమయ్య కార్ఖాన్ల బీడీలు సేత్తున్నానని ఈంతన్న, అజారు బీడీలకు ఆకు తంబాకు ఇత్తున్నరు. మనకు ఇంతే అనుకుని సమాధాన పడాల. నువ్వు ఊకూకె గిట్ల మాట్లాడి గూసులాడతవని నీ బీడీలు ఎక్క చాటన్ సేత్తరు" బాలవ్వ కూతుర్ని మందలించింది.

"సేత్తరు, సేత్తరు. గిప్పుడు మా అన్న అచ్చిండు. తను ఆల్ల యువజన సంఘపోల్లతోని మాట్లాడి గీ కమిషన్‌దార్ల పని పడుతనన్నడు. గప్పుడు ఈల్ల తమాష ఎల్తది..'

"ఔ సెల్లె, మేం బీడీ కమిషన్ ఏజెంట్ల మీటింగ్ పెడ్తం. డిపో మానేజర్లను, నిజాంబాద్‌ల బీడీల శేట్లను కల్సుకుంట నువ్వు ఫికరు సెయ్యకు" ధర్మపురి అమృతకు భరోసా ఇచ్చాడు. మర్నాడు ధర్మపురి తన స్నేహితులతో మాట్లాడుతూ ఒర్ది విషయం కదిపాడు.

"ఒర్ది ఇయ్యాల్ల మొదలైంది కాదు. మునుపటి నుంచే ఉన్నది. బీడీల కూలి యాభై దాటిన్నుంచి, ఒర్దికి బీడీలు చేపిచ్చుడు ఎక్కైంది. దీంట్ల కమిషన్‌దార్లకు బాగా ఫాయిదున్నది" గొల్ల మల్లేశం అన్నాడు.

"గిది అన్నాలం గదా! ప్రావిడెంట్ ఫండు కారటున్నోల్లకు తక్క తంబాకిచ్చి ఆల్ల పేరు మీది బీడీలు ఇంకోల్లతోని తక్క కూలికి ఒర్దికి చేపిచ్చుడు మనం బందు జేయాలె."

"ఔ. బందు జేయాలె" సాంబయ్య వంత పాడాడు.

"బందు జేయాలె అని అనుడు అల్కగనే గని, దాంతోని కూలోల్లకు ఎంత నుకసానో గుర్తుందా?" లింబగిరి అన్నాడు.

"ఒర్ది బందు జేత్తె బీడీలు జేసెటోల్లకు లాభమైతది, నష్టమెట్లయితది?" హరిదాసు సంశయం.

"ఫండు కారటున్నోల్లకు ఫాయిదయితదేమో, కాని వేరోల్లకు బతుకుతోవ బందయితది. పొలం పనులు జేసెటోల్లకు యాడాదికి ఆర్నెల్లే కూలి పనులు. మిగిలిన

ఆర్నెల్లు అల్లు ఒర్దికి బీడీలు జేసి పొట్టగడుపుకుంటరు. అట్లనే పైసలు అవుసరం ఉన్నోల్లు రాజీనామా పెట్టినంక మల్ల కారటు పుట్టది. గసుంటోల్లకు ఒర్ది బీడే దిక్కు. ఇంటిమీద ఉన్న ఆడపడుసులకు మనూర్లె కారటోల్లు ఇత్తరు? అల్లకు గూడ ఒర్ది బీడే దిక్కు" నాందేవ్ చెప్పాడు.

"ఎటుగుడ గిసోంటల్లకు గర్జు ఉన్నదని, ఫండు కారటోల్లకు అన్యాయం జేసుడు మంచిదే?' సాంబయ్య ప్రశ్న.

"బీడీ కార్మికులందరికి పి.ఎఫ్. ఉండాలని గవర్మెంటు కానూన్ జేసింది. మరి అప్పుడప్పుడు బీడీలు జేసెటోల్ల గురించి కూడా ఆలోసించాలిగదా? లెక్క జూత్తె, అల్లకు ఫండు, ఫించను ఉండనందుకు ఎక్క కూలి ఇయ్యాల."

"ఎక్క కూలి ఇయ్యకున్నా, గవర్మెంటు కూలి ఇచ్చినా మా యక్క. ఇట్ల మనండ్ల మనం మాట్లాడుకుంటే ఒడిసే పనిగాదు. బీడీ కమీషను ఏజంట్లతోని మీటింగ్ పెట్టి మాట్లాడి ఏమన్న పైసల జేయాలె" ధర్మపురి ప్రతిపాదించాడు. అదే మంచిదని అందరు తమ తమ ఇండ్లకు బయలుదేరారు.

* * *

ఒక ఆదివారం సాయంత్రం, గ్రామ పంచాయితి సభాగృహంలో బీడీ కమీషన్ ఏజంట్ల సమావేశం ఏర్పాటు చేశారు, ధర్మోరా యువజన సంఘంవారు. గ్రామ సర్పంచు, ఇతర పంచాయతీ సభ్యులే కాకుండా, చుట్టుప్రక్క గ్రామాలైన శెట్‌పల్లి, రెంజర్ల, పాలెం, దొన్కల్, పోశంపల్లి అంక్సాపూర్, వన్నెల్, పడ్గల్ గ్రామాల్లోని బీడీ కమిషన్ ఏజంట్లు వారి నాయకులు ఆ సమావేశానికి హాజరయ్యారు.

యువజన సంఘం కార్యదర్శి, ఆహ్వానితులకు స్వాగతం పలికి, సమావేశం యొక్క ఉద్దేశ్యం వివరించాల్సిందిగా ధర్మపురిని కోరాడు.

"పెద్దలందరికి నమస్కారం. మా కోరిక మన్నించి ఈ మీటింగ్‌కు వచ్చిన మీ అందరికి ధన్యవాదాలు. ఈ మధ్య మన జిల్లాలో ఒర్దికి బీడీలు చేయించడం మరీ ఎక్కువయింది. ఫండు కారటు ఉన్నవారికి వారి వంతు కన్న తక్కువ తంబాకు ఇస్తున్నారు. వారి వాటా తంబాకుతో వేయికి ఇరువై రెండు రూపాల కూలి తక్కువ ఇచ్చి టెంపరరీ కార్మికుల ద్వారా బీడీలు చేయిస్తున్నారు. దానివల్ల ఫండు కారటున్నోల్లు తగినంత పని దొరుకక, ఒర్దికి బీడీలు చేసేవాళ్లు సరిఐన కూలి దొరక్క నష్టపోతున్నారు. ఇది పద్ధతి కాదు. మనందరం కార్మిక వర్గానికి చెందినవారమే. బీడీలు చేయించినందుకు మీకు కమిషన్ వస్తే, బీడీలు చేసినందుకు మాకు కైకిలి (కూలి డబ్బులు) దొర్కుతది. అందుకని మనండ్ల మనం మాట్లాడుకొని సామరస్యంగా ఈ సమస్యకు పరిష్కారం వెతకాలి. ఈ విషయంలో మీరందరు ఆలోచించాలని మనవి" ధర్మపురి ముగించాడు.

జిల్లా బీడీ కమీషన్‌దార్ల నాయకుడు సుదర్శన్ లేచి "సోదర సోదరీమణులారా! ఈరోజు ఈ ఊరి యువజన సంఘంవారు ఈ సభ ఏర్పాటు చేయడం నాకు సంతోషం. ఏవో ఫాల్తు ముచ్చట్లు పెట్టుకుంట, ఆడపొల్లగండ్లను చిడాయించుకుంట, పత్తాలాట ఆడుకుంట టైంపాస్ చేసే యువకులు ప్రతి ఊర్లో ఉంటారు. కాని ఇక్కడి పిల్లగాండ్లు బీడీ కారగిర్ల గురించి సభ పెట్టిండ్రు. గది నాకు శాన మంచి గన్పించింది. ఒర్ది బీడీల విషయంల

మా ఇబ్బందులు గూడ మీకు సెప్పాల. మేము మా కుషీతోని తక్క కూలికి బీడీలు సేపిత్తలేము. ఇది మా హెడ్డాఫీసు నిజాంబాదు కెల్లి అచ్చిన ఆదర్లు. ఒర్దికి సేపించిన బీడీలకు వెయికి ఇరువైరొండు రూపాల కూలి తక్కువ ఇచ్చే మాట నిజమే. అయితే అవన్ని రూపాలు మా కీసలకు రావు. దాంట్ల సగంహెడ్డాఫీసుకు పోత్రై, కొంత డిపో మానేజర్ల కియ్యాలె. అవన్ని పోంగ మాకు దొరికేది మామూలు కన్న రెండే రూపాలు ఎక్క. గింత మేనత్ జేసినందుకు గాయింత గిట్టుబాటు గాకుంటె ఎట్ల? మీరే ఆలోసించుండ్రి. సుదర్శన్ తమ వాదం వినిపించాడు.

"ఈల్ల మాట గూడ నివద్దే (నిజమే). కారటు లేనోల్లకు ఒర్దికి తంబాకు పోత్తే? కమిషన్‌దార్లకు బాగ ఫాయిదున్నదని మీరు అనుకుంటున్రు. దాంట్ల ఆల్లకు ఎంత రిస్కున్నదో మీకెమెరుక? ఓల్లన్న చెకింగ్‌కు అచ్చిరంటే ఈల్లపని గోవిందా! ఆల్లకు తినిపించి, తాగిపిచ్చి గొన్ని రూపాలు సేతుల వెద్తేగాని ఈల్లు గట్టెక్కరు. గిదంత సేసినందుకు గీల్లకు గాయింత ఫాయిద ఉండద్దా? సదుకున్నోళ్లు మీరు. జర సోచాయించుండ్రి" గ్రామ సర్పంచు కమిషన్‌దార్లకు వత్తాసు పలికాడు. పలకడా మరి? అంతకు క్రితం రాత్రి, బీడీ కమిషన్ ఏజంట్లు, సర్పంచికి, ఇతర గ్రామ పెద్దలకు చికెన్‌ఫ్రై – 'మందు పార్టీ' ఇచ్చారు!

"ఔ. సర్పంచిసాబ్ సెప్పింది వాజీవే (న్యాయమే). పొలంల పనిజేసే మా ఆడోల్లకు, యాడాదిల ఆర్నెల్లు పొలం పనులుంటే, ఆర్నెల్లు బీడీలు సేత్తరు. ఆల్లకు ఫండు కారటు పుట్టది. మరి గాల్లకు ఒర్దికి తంబాకియ్యవట్టే, ఈంత దినాలెల్తున్నయి. నోట్లెకు నాలుగు బుక్కలు పోతున్నయి. కారటున్నోల్లకు, లేనోల్లకు ఒక్కంత కూలి ఇయ్యాలంటే ఎట్ల? ప్రశ్నించాడు గొల్ల గోవిందు.

"ఇక్కడ ప్రశ్న ఒర్దికి ఎందుకు బీడీలు సేపిత్తున్నరని గాదు. ఆల్లకు గంత తక్క కూలి ఇచ్చుడు వాజీవేనా? ఓ అయిదు రూపాలు తక్కిస్తే ఏం గాదు. ఆల్ టోటల్ ఇరువై రొండు రూపాలు తక్క ఇచ్చుడు న్యాయమేనా?" గొల్ల మల్లేశం అందుకున్నాడు.

"ఇంతకుముందు మా సెక్రెటరీసాబ్ సెప్పినట్టు ఆ తక్క జేసిన కూలి పైసలు మా కొక్కొల్లకే దొరుకుతలేవు. మాకు తగినంత ఆకు, తంబాకు ఇచ్చే శేట్లకు, కమ్మరపెల్లి డిపో మానేజరుకు అందరికీ ఆ పైసలు అందజేయాల. ఈ ఒర్ది బీడీలు సేపిచ్చుడు కాదు గని దీంతోని మాకెంత తలనొప్పి ఉన్నదో మీకేమెరుక?" బీడీల భూమయ్య స్పష్టీకరణ.

"ఇక్కడ మీటింగ్‌కచ్చి, సత్యపూసలలెక్క మాకు దొంగ లెక్కలు జెప్పకుండ్రి. చాటన్ బీడీలల్ల, ఆకు తంబాకు అమ్ముకొనుట్ల మీకున్న ఫాయిద మాకు తెల్వదే? మెట్‌పెల్లిల మా మామ గూడ కమిషన్‌దారే. మీరు కమాయించే తోవలన్ని ఒకనాడు తాగుడు నిషల, నాతోని జెప్పిండు" సాంబయ్య వారి బండారం బయటపెట్టాడు.

"అవును. వేయికింతని ఆకు, తంబాకు మీకు తూకంవేసి ఇస్తే, కారగిర్లకు ఇచ్చేటప్పుడు మీరు దాన్ని తగ్గించి ఇస్తారు. అలా మిగిలిన ఆకు, తంబాకు అమ్ముకోవడం మీకు వెన్నతో పెట్టిన విద్య. అలా అక్రమంగా సంపాదించడమే గాక ఒర్ది బీడీల్లో కూడా మీకు బాగా లాభం ఉందని మాకు తెలుసు. మీ ఈ ఆటలు నిజామాబాద్‌లోని మీ హెడ్డాఫీసుకు తెలిపామంటే, మీలో కొందరి ఏజన్సీ కూడా పోవచ్చు. ఆ పరిస్థితి రానీయకుండా, ఒర్ది బీడీల కూలి పెంచమని ప్రార్థిస్తున్నాము" ధర్మపురి విన్నవించాడు.

"మీకు మా సంపాదన అక్రమమని దెప్పడం తెలుసు, కాని మా గోడు ఎవరితో చెప్పుకోవాలి? బీడీల కూలి పెరిగిన అనుపాతంలో మా కమిషను పెరిగిందా? రోజు రోజుకు మా కిచ్చే ఆకు, తంబాకు తక్కువ కావడం ఒకవైపు, బీడీల అమ్మకం తగ్గి సెలవులు ఎక్కువ ఇవ్వడం ఇంకోవైపు, దీంతో మా ఆదాయానికి గండిపడుతోంది. పెరుగుతున్న ధరల కనుగుణంగా మా ఆదాయం పెరగడంలేదు. ఇంతమందితోని బీడీలు చేపించి, గంపలు డిపోకి, చేర్చాలి. గంపవాడికి జీతం ఇవ్వాలి. మేం చాటన్ చేసేది మీకు కన్పిస్తుంది. కాని మా గంపలో కూడా చాటన్ చేస్తారని మీకు తెలుసా? మా కమిషన్ బట్వాడా మీలా వారం వారం రాదు. ఏ రొండు మూన్నెల్లకో ఇస్తారు. దాని నుండి కూడా డిపో సిబ్బందికి ముడుపులు చెల్లించాలి. ఇన్ని ఖర్చులు ఉన్నాయని మీకు తెలుసా? ఈ విషయంగాని మీరు మాపై అధికార్ల దగ్గరికి తీసుకెళ్తే, ఉన్నది పోతుంది, ఉంచుకున్నది పోతుంది. ఒర్ది బీడీలు మొత్తం బందయితవి. ఇక మీ ఇష్టం." బీ.కాం. చదివి ఉద్యోగం దొరుకక, శెట్‌పల్లిలో బీడీ కమిషన్ ఏజంటుగా ఉన్న జగన్నాథం వారివైపు కోణం చూపించాడు. ఇలా వాదనలు, ప్రతివాదనలు జరిగి చివరకు ఒర్ది బీడీల కూలి మరో రెండు రూపాయలు పెంచడానికి ఏజంట్లు ఒప్పుకున్నారు. మీటింగ్ ముగిసింది. మర్నాడు ధర్మోరా యువజన సంఘం కార్యకర్తలు సమావేశమయ్యారు. గ్రామపెద్దలు, బీడీ కమిషన్ ఏజంట్లతో కుమ్మక్కయిన సంగతి చర్చించారు. ఇక ఊళ్ళో లాభం లేదని, పై స్థాయిలో ఈ విషయం పరిష్కారానికి ప్రయత్నం చేయాలని నిర్ణయించారు. ఒర్ది గురించి చర్చించడానికి, ధర్మపురితో సహా నలుగురు యువకుల బృందం ఏర్పాటైంది.

* * *

ధర్మపురి బృందం, వివిధ కంపెనీల డిపో మానేజర్లను కలిసింది. అయితే ఒర్దికి బీడీలు చేయిస్తున్నామని వారు ఒక పట్టాన ఒప్పుకోలేదు. కొన్ని రుజువులు చూపించిన తర్వాత, హెడ్డాఫీసు ఆదేశాల మేరకే తాము ఒర్దికి బీడీలు చేయిస్తున్నామని అన్నారు. అయితే ఎక్కడా తమ పేరును బయటపెట్టద్దన్నారు. ఆ తర్వాత ధర్మపురి, తదితరులు, నిజామాబాద్‌లోని పలు కంపెనీలు సందర్శించారు. వారు ఒర్ది బీడీల గురించి అస్సలు తెలియనట్లే మాట్లాడారు. తమకు ఒర్ది గురించి ఏమీ తెలియదనీ, తమ కంపెనీ వ్యవహారాలన్నీ నియమ, నిబంధనలకు కట్టుబడి ఉన్నాయని నొక్కి వక్కాణించారు. అలా అక్కడ వారికి చుక్కెదురైంది.

కొందరు పరిచయస్థులైన సిబ్బందిని కదిపితే, ఒర్ది బీడీల వ్యవహారం మొత్తం చట్టవిరుద్ధమనీ, ఆ వ్యవహారంలో ఎక్సైజు పన్ను ఎగవేత భారీ ప్రమాణాల్లో జరుగుతోందని తేలింది. ఇంత పెద్ద కుంభకోణాన్ని ఛేదించడం, అనుకున్నంత తేలిక కాదని అర్థమైంది ధర్మపురి బృందానికి. వారు తమ వ్యూహం మార్చారు. జిల్లాలో బీడీ కార్మికులు ఉన్న గ్రామాలన్నింటినీ వారు బ్యాచులవారీగా సందర్శించి, బీడీ కార్మికులను, యువకులని జాగృతపరిచారు. ఒర్ది కార్మికుల కష్టనష్టాలను జిల్లా అధికారుల దృష్టికి ఒర్ది విషయంలోనే కాక, ఆకు, తంబాకు తక్కువ ఉందని కూలీలో కోత విధించడం, ఎక్కువ బీడీలు చాటన్ చేయడం లాంటి అన్యాయాలు వెలికితీసారు.

'ఒర్ది' ఒక ఉద్యమరూపం దాల్చింది. వార్తాపత్రికలు కూడా, బీడీ కార్మికుల వెతలు ప్రచురించి ఉద్యమానికి ఊపిరిపోశాయి. బీడీ కంపెనీల యాజమాన్యంలో, కమిషన్ ఏజంట్ల

గుండెల్లో గుబులు మొదలైంది. వారు బీడీ కార్మిక యూనియన్ నాయకులను సంప్రదించారు. గ్రామపెద్దలకు డబ్బులు పంచి వారి ఊర్లల్లోని యువతను అదుపులో పెట్టమన్నారు. ఈ 'ఒర్ది' ఉద్యమం జయప్రదమైతే, తమ ఉనికికే ప్రమాదం అని తలచి, యూనియన్ నాయకులు రంగంలోకి దూకారు. 'ఒర్ది' కొందరు కార్మికుల పట్ల వరమనీ, వారి సమస్యలు ప్రభుత్వం దృష్టికి తెచ్చి తగు న్యాయం చేస్తామని ఆశలు చూపారు. అయినా ధర్మపురి బృందం లొంగలేదు. యువకులు, బీడీ కార్మికులు ఒకవైపు, కమిషన్ ఏజెంట్లు, గ్రామపెద్దలు ఇంకోవైపు. వీరి మధ్య తగాదాలు పతాకస్థాయికి చేరాయి. సామరస్యంతో సమస్య తీరేలా లేదని అక్కడక్కడ దొమ్మీలు జరిపారు యూనియన్ నాయకులు. కొన్ని గ్రామాల్లో పోలీసులు జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. బీడీ యాజమాన్యం డబ్బు వెదజల్లి తమాషా చూస్తోంది.

* * *

అంక్సాపురంలో ఓ సమావేశానికి హాజరై, స్కూటర్లపై ధర్మోరాకు తిరిగి వస్తుండగా, ముఖానికి మఫ్లర్ చుట్టుకున్న దుండగులు ధర్మపురి బృందంపై దాడి చేశారు. ధర్మపురి, సాంబయ్య తీవ్రంగా గాయపడ్డారు. వారిని ఆర్మూరు హాస్పిటల్లో చేర్పించారు.

ఒళ్ళంతా కట్లతో ఉన్న కొడుకుని చూడగానే, బాలవ్వ దుఃఖానికి గట్టు తెగింది. ఆమె గుండెలు బాదుకుంటూ శోకాలు తీయసాగింది.

"గీ ఒర్ది బీడీలు పాడుగాను, నీ బతుకు బండలాయె నానా, ఓ నానా! నేనద్దన్నా నువు మందికోసం పాటుపడితివి, నానా ఓ నానా! నువు పెద్దనౌకిరి జేసి నన్ను దొరసాని లెక్క జూసుకుంటవనుకున్న నానా, ఓ నానా!" అని పలువిధాల దుఃఖించసాగింది. అమృత కూడా వెక్కిళ్లు పడుతూ ఏడ్వసాగింది. తన మూలంగానే అన్న ఈ ఉద్యమంలోకి దూకాడని, తనకు తాను దోషిగా భావిస్తూ దుఃఖపడింది. ధర్మపురి బృందాన్ని కొట్టిపించింది, బీడీ యాజమాన్యం అండతో జిల్లా కార్మిక నాయకులని పత్రికలు ఎలుగెత్తి చాటాయి. ఒర్ది ఉద్యమవార్త రాష్ట్రంలోని వేరే జిల్లాలకు కూడా పాకింది. వివిధ ప్రదేశాల నుండి ప్రజలు, యువకులు, నాయకులు, రాజకీయనేతలు ధర్మపురిని పరామర్శించడానికి వస్తున్నారు. ధర్మపురి సహచరులు ఈ ఉద్యమం గురించి వచ్చిన వారందరికి చెబుతున్నారు. ఒర్ది బీడీల సమస్య చుట్టుప్రక్క జిల్లాలైన కరీంనగర్, ఆదిలాబాద్, వరంగల్‌లో కూడా ఉండడం వలన, ఆ జిల్లాల్లో కూడా ఉద్యమానికి మద్దత్తు లభించింది.

కట్లతో పడకకు పరిమితమైన ధర్మపురిలో ఎన్నో ఆలోచనలు! తానొకటి తలిస్తే దైవమొకటి తలచినట్లు తన ఆశలు, ఆశయాలు అడియాసలేనా? అని తనలో తను మథనపడుతున్నాడు.

ప్రభాకర్ సార్ పరామర్శించడానికి వచ్చినపుడు ఆయనతో ధర్మపురి తన బాధను వ్యక్తం చేశాడు. "సార్! మీరే కదా మమ్మల్ని ప్రోత్సహించింది? మేం చేసింది తప్పా? న్యాయానికై శాంతియుతంగా పోరాడుతున్న మమ్మల్ని ఇలా చేయడం భావ్యమా? మీరే చెప్పండి. బీడీ కార్మికుల పొట్ట గొట్టకండి అని బతిమాలితే మమ్మల్నే కొట్టిరి. వీరి ఆగడాలకు అంతేలేదా? ఈ అన్యాయమిలా కొనసాగవలసిందేనా? చెప్పండి సార్! చెప్పండి."

"ప్రతిదానికీ అంతమనేది ఉంటుంది ధర్మపురీ! కాకపోతే దానికి కాస్త సమయం పడ్తుంది. ఎంత డబ్బున్నవాడైనా, తన తిండికి, బట్టకు, షోకులకు ఏ లేటు లేకపోయినా,

తనకు చెందనిదాన్ని అన్యాయంగానైనా పొందడానికి ప్రయత్నం చేస్తాడు. కష్టపడి గాక అప్పనంగా ఆస్తి కూడబెట్టుకోవాలనుకుంటాడు. ప్రతివాడూ ఒక్కరోజులో కోటీశ్వరుడు కావాలనుకునేవాడే. కాని దానికి తగిన కృషి చేయడు. ఇలా అక్రమంగా సంపాదించాలనుకుంటాడు. వేల రూపాయల జీతం తీసుకునే అధికారి లంచం ఎందుకు తీసుకుంటాడు? కోట్ల ఆస్తి ఉన్న రాజకీయ నాయకులు, వక్రమార్గాన మరిన్ని కోట్లు కూడబెట్టాలని తాపత్రయపడతారు. ఎందుకు? వేయికింతని కమిషన్ పొందే ఏజంటు, ఆకు, తంబాకు అక్రమంగా అమ్ముకుంటాడు. ఎందుకు? తక్కువ కూలి ఇచ్చి ఒర్దికి బీడీలు చేయిస్తాడు ఎందుకు? తాగి తందనాలాడడానికీ, తన తరతరాలకు సరిపడా ఆస్తి కూడబెట్టడానికి. ఆస్తులు తమ వెంట రావని తెలిసీ, మనిషి అనుదినం డబ్బు వ్యామోహంలో ఉంటాడు. స్వార్థం ప్రబలి ఇలాంటి ఆగడాలకు ప్రాణం పోస్తుంది. 'దురాశ దుఃఖానికి చేటు' అని చిన్ననాడు చదివిన పాఠాలు గాలి కెగిరిపోతాయి. ఇవి ఇలా సాగవలసిందేనా? అంటే, కాదు అని సమాధానమొస్తుంది. దాన్ని ఆపడానికి మనలాంటివాళ్లు ప్రయత్నాలు చేస్తుండాలి. ఈ కార్యంలో మీలాంటి వారెందరు సమిధలు కావాలో! అధికారులకు అర్జీలు పంపించి ఈ సమస్య పరిష్కారానికి నా వంతు కృషి చేస్తున్నాను. నీ ఆరోగ్యం జాగ్రత్త" ప్రభాకర్‌సార్ సెలవు తీసుకున్నడు. మానసికంగా అలసిన ధర్మపురి నిద్రలోకి జారిపోయాడు.

* * *

ఒర్ది ఉద్యమం ప్రభుత్వంలో కలకలం సృష్టించింది. క్యాజువల్ లేబర్, రిటైర్మెంట్ తీసుకున్నవారు, ముసలి ముతక బీడీ కార్మికుల అసహాయతను తమ ప్రయోజనాలకు వాడుకునే కమిషన్ ఏజంట్ల ఆగడాలను అరికట్టే పథకం రూపొందింది. ఫండు కార్డు లేకుండా బీడీలు చేయించే ప్రక్రియను క్రమబద్ధీకరించడానికి కొన్ని నియమాలు రూపొందించారు. నియమాలు పాటించనివారికి తీవ్ర దండన ఉండేట్టుగా ఆర్డరు జారీ చేశారు. అక్రమాలు చేసేవారి మీద కంప్లైంట్లపై తగు చర్య తీసుకోవడానికి గ్రామ కార్యదర్శి నుండి, మండల, జిల్లా స్థాయిలో అధికారుల యంత్రాంగం స్పష్టం చేశారు. పేపర్లో ఈ వార్త చదివి ధర్మపురి మనసు పులకించింది. తన శ్రమ సార్థకమైనందుకు, ఆనందం కలిగింది. కళ్ళనుండి ఆనందబాష్పాలు రాలసాగాయి.

"అన్నా ఇంక లెవ్వలేదా? లేసి గొంత బువ్వ తిను" అమృత పిలుపుతో ఈ లోకంలోకి వచ్చాడు ధర్మపురి. అయితే... అదంతా కలా? అవును కలే. తను నిజమవాలనుకున్న కల! పూర్తిగా మేల్కొని అమృతను ఊళ్ళోని విశేషాలు అడిగాడు.

"నీకు తెలందేమున్నదన్నా? ముందట ఉన్నోడి మూతిపండ్లు రాల్తయి. మనం అది జేద్దం, ఇది జేద్దం అని నీ వెంట పడిరి. నువ్వు ఆస్పిటల్ల పడ్డంక ఎంతో మందచ్చి నీకు ధైర్యం చెప్పిరి. ఇప్పుడు మెల్లమెల్లగ అందరు జారుకున్నారు. మనలకు మన కర్మకు ఇడిసిపెట్టింద్రు. ఇయ్యల్ల మాకు బందు. నీ మందుల కర్సు కఇుతయని మన అమ్మ ఒర్దికి తంబాకు దెచ్చుకున్నది. గందుకని నిన్ను జూసెతందుకు రాలె.

ఒర్ది కూలీ దబ్బులతో తనకు మందులు!

ధర్మపురిలో ఉద్వేగపు ఉప్పెన!